క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, భోజన సౌకర్యం పరిసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిలబస్ ఎంత వరకు పూర్తయింది, భోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల ఎస్సీ హాస్టల్‌లో బోర్‌వెల్ ఏర్పాటు



బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

నెన్నెల: నెన్నెల ఎస్సీ హాస్టల్‌లో నీటి సమస్య గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించారు. బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను శనివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.2.50లక్షల వ్యయంతో బోరు వేసి కొత్త మోటారు కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బోర్‌వెల్ ఏర్పాటుతో తమ ఏళ్ల నాటి నీటి సమస్య తీరిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్‌గౌడ్, నెన్నెల వార్డెన్ జయశంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల 3, 4 అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు శనివారం అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, వనిత, ఆయా అమృతమ్మ ఉన్నారు.

బుయ్యారంలో 'కార్డన్‌సెర్చ్'



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాం పటేల్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన వాహనపత్రాలు లేని 33బైక్‌లను సీజ్ చేశారు. వాహనాలకు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, సోషల్ మీడియా వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేయాలి



వేలాడుతున్న విద్యుత్ తీగలు

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం శివారులో 11కేవీ విద్యుత్ తీగలు లూజ్‌గా ఉండటంతో వరి పంటలు కోసేటప్పుడు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. హార్వెస్టర్‌కు తాకేలా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని జంకుతున్నారు. అధికారులకు విద్యుత్ వైర్లు సరిచేయాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పంట పొలాల కోత సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేయాలని కోరినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు లూజ్‌వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.

గతేడాది గందరగోళం..!

- ఈ ఏడాదైనా సజావుగా జరిగేనా..?
- త్వరలో ప్రారంభం కానున్న పత్తి కొనుగోళ్లు
- ఇబ్బందులు లేకుండా చూడాలని రైతుల వేడుకోలు



చెన్నూర్ జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు (ఫైల్)

చెన్నూర్: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటను అమ్ముకునేందుకు రైతులు గతేడాది అరిగోస పడాల్సిన దుస్థితి ఏర్పడింది. పోయిన సంవత్సరం చెన్నూర్ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోళ్లు గందరగోళంగా మారడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. యార్డు వద్ద వందలాది పత్తి వాహనాలు రెండు కిలో మీటర్ల మేర బారులు తీరాల్సి వచ్చింది. దీంతో జాతీయ రహదారిపై ఒక దశలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పత్తి రైతులకు టోకెన్ల జారీ విషయంలో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు టోకెన్ల జారీ విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో రైతులు యార్డు ఎదుట పడిగాపులు కాశారు. వందలాది పత్తి వాహనాలు జాతీయ రహదారిపై రెండు నుంచి మూడు రోజుల పాటు నిలిచి పోయిన ఘటనలు ఉన్నాయి. టోకెన్ల జారీ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించకుండా, దళారులకు పెద్దపీట వేశారని రైతుల ఆరోపణలు ఉన్నాయి. దళారులకు టోకెన్లు వెంటవెంటనే జారీ చేయడంతో రైతుల వాహనాలు రెండు రోజుల పాటు యార్డు వద్దనే ఉండడంతో వాహనాల చార్జీ తడిసి మోపడైంది. గతేడాది పత్తి టోకెన్ల జారీ విషయంలో జరిగిన పొరపాట్లను ఈ ఏడాది జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఐదు జిన్నింగ్ మిల్లులు..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఐదు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. త్వరలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 1,51,386 ఎకరాల్లో పత్తి సాగు కాగా చెన్నూర్ డివిజన్‌లో 38,228 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇందులో చెన్నూర్ మండలంలో 12432 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. జైపూర్ మండలంలో 4586, భీమారం 3810, కోటపల్లి 17500 మండలాలలో పత్తి సాగు చేశారు. నాలుగు మండలాల రైతులు పత్తిని చెన్నూర్ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులోనే విక్రయిస్తారు. జిల్లాలోని ఈ నాలుగు మండలాల్లో పత్తి దిగుబడి బాగుంటుదని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. పత్తి దిగుబడి బాగుండడంతో పత్తి కొనుగోళ్ల విషయంలో అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం పత్తి కోనుగోళ్లు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నానా ఇబ్బందులు పడ్డాం..



పోయిన ఏడాది పత్తి అమ్ముకునేందుకు నానా అవస్థలు పడ్డాం. రెండు రోజుల పాటు యార్డు వద్దనే ఉండాల్సి వచ్చింది. రోజుకు రూ.5వేల చొప్పున వాహనానికి రెండు రోజులకు రూ.10వేలు చెల్లించాల్సి వచ్చింది. అధికారులు మిల్లుల వారీగా ముందస్తుగా టోకెన్లు జారీ చేస్తే రైతులు ఇబ్బంది పడకుండా ఉంటుంది.

– బజ్జూరి మధు, రైతు, చెన్నూర్

కలెక్టర్ ఆదేశాల మేరకు...

కలెక్టర్ ఆదేశాల మేరకు పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తాం. పక్కా ప్రణాళిక ప్రకారం రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపడుతాం. టోకెన్ల జారీ, స్లాట్ బుకింగ్ పద్ధతి ప్రకారం పత్తి అమ్మకాలు చేపట్టాలా.. అనే విషయం జిల్లా కలెక్టర్ ఆదేశించాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొనుగోళ్లు చేపడుతాం.

– రామాంజనేయులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, చెన్నూర్

పిల్లలు జాగ్రత్త.. వారంలో మళ్లొస్తా..!

- ఎస్టీ బాలికల వసతిగృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచన
- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం
- మళ్లొచ్చేసరికి పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు ఆదేశం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దు.. మీ పిల్లల్లాగా జాగ్రత్తగా చూసుకోండి.. ప్రతి వారం చెప్పకుండా ఎప్పుడైనా ఇక్కడకు వస్తా.. పొరపాట్లు జరిగినట్లు తేలితే చర్యలు తప్పవని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సాయికుంట ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, వసతిగృహంను శనివారం ఆయన పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో ప్రత్యేకంగా కాసేపు ముచ్చటించారు. పిల్లలు పడుతున్న ఇబ్బందులు.. ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాలికలు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన ఘటనలో త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయని, బాధ్యులైన వారికి శిక్ష తప్పదన్నారు. వసతిగృహ వంట గదిని పరిశీలించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రం, శుచికరమైన భోజనం వండి వడ్డించాల్సిన బాధ్యత మీపైనే ఉందని వంటమనుషులకు సూచించారు. భోజన విషయంలో రాజీ పడొద్దన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై వసతిగృహ నిర్వాహకుడు, ఇన్‌చార్జి హెచ్‌ఎంపై అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ వచ్చేసరికి అంతా శుభ్రంగా కనబడాలని, పాములు, తేళ్లు రావనే నమ్మకం పిల్లలకు కలిగించాల్సిన బాధ్యత మీదేనని నిర్వాహకులను ఆదేశించారు. పిల్లలు అమాయకంగా ఉండొద్దని.. ఎవరికి భయపడకుండా, ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు భరోసానిచ్చారు. ఇదివరకు ఇచ్చిన మాట ప్రకారం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలను కొనుగోలు చేసి విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే వెంట నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్‌అధ్యక్షుడు తూముల నరేష్, ఎస్సీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు భానేష్, వోడ్డె రాజమౌళి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని గోదావరి తీరంలో గనులు, భూగర్భ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ కారణంగా గతంలో గోదావరి నుంచి ఇసుక రవాణకు నిత్యం ఆటంకాలు ఏర్పడేవని, ఇప్పుడు ఇక ఇబ్బందులు ఉండవన్నారు. నియోజకవర్గ ప్రజల ఇళ్ల నిర్మాణాల అవసరాలు తీర్చాకే, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా విషయంలో నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉదయం 5 నుంచి రాత్రి 7గంటల వరకు రీచ్ నిర్వహణ సాగాలన్నారు. ఇక ఆన్‌లైన్‌లో ఉండే డిపాజిట్ రుసుంతో ఇసుక రీచ్ నిర్వహణ, గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. ఇసుక రీచ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, మైనింగ్ శాఖ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఎస్సై గోపతి సురేశ్, మండల ప్రజాప్రతినిధులు, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

ప్రజలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: ప్రజలకు కంటి చూపు ప్రసాదించడం తమ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం ఎమ్మెల్యే వినోద్ తనయ గడ్డం వర్ష ఆధ్వర్యంలో నెన్నెల మండల ప్రజల కోసం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కూతురుతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ఎమ్మెల్యే వినోద్ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు, ఆపరేషన్ అవసరమైన వారికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్యనిపుణులతో శస్త్రచికిత్స చేయిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వినోద్ సతీమణి రమ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, అటవీ శాఖ జిల్లా అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ జోత్స్న, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, టీపీసీసీ సభ్యుడు సీ.హెచ్.శంకర్, మాజీ ఎంపీటీసీ సభ్యు డు హరీష్‌గౌడ్, పలువురు మున్సిపల్ కౌన్సెలర్లు,నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ కోరారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు



సర్వే పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో శనివారం ఇంటింటా చేపడుతున్న కుటుంబ సర్వేను డీపీవో పరిశీలించారు. సిబ్బందికి కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం నిర్ణీత నమూనాలో కుటుంబ వివరాలన్నీ వివరంగా నమోదు చేయాలన్నారు. వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటించాలని, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించాలని చెప్పారు.

మార్కెట్లోకి కొత్త డిజైర్ కారు



నూతన డిజైర్ కారును ఆవిష్కరిస్తున్న మంచిర్యాల ఆదర్శ షోరూం నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మారుతి సుజికి ఆదర్శ షోరూంలో శనివారం డాజ్లింగ్ న్యూ డిజైర్ కారును మార్కెట్‌లోకి ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీఐ ఆర్‌ఎం రితీష్ కుమార్ గుప్తాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, 360డిగ్రీల హెచ్‌డీ కెమెరా, 6 ఎయిర్ బ్యాగ్‌లు, అత్యధికమైన మైలేజీ, 5 స్టార్ సేఫ్టీ రేటింగ్‌లతో కూడిన ప్రత్యేకతలు ఉన్నట్లు వారు తెలిపారు. ఎక్స్‌షోరూం ధర రూ.6.79 లక్షల్లో ఉందని, ప్రజలకు అందుబాటు ధరల్లో లభిస్తుందని సేల్స్ మేనేజర్ యు. రమేశ్ అన్నారు.

సంక్షిప్త వార్తలు

యువతి పెళ్లికి సాయం

మందమర్రిరూరల్: నెన్నెల మండలంలోని దుబ్బపల్లికి చెందిన శ్రావణి అనే యువతి పెళ్లికి మందమర్రి పట్టణానికి చెందిన పంచముఖి భవాని టీం సాయం అందించింది. శనివారం యువతికి టీం ఆధ్వర్యంలో సేకరించిన పుస్తె మట్టెలు, నూతన వస్త్రాలు, నగదు రూ.5వేలు ఆర్థిక సాయం సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా అందించారు.

అనాథ యువతి వివాహానికి...

జన్నారం: తల్లిదండ్రులు కోల్పోయిన పొనకల్‌కు చెందిన అనాథ యువతి మేకల శ్రీవాణి వివాహం కోసం శనివారం పలువురు దాతలు ముందుకొచ్చారు. పొనకల్‌కు చెందిన పిల్లి మల్లయ్య దంపతులు వంట పాత్రలతో పాటు బట్టలు అందజేశారు. ప్రెస్‌క్లబ్ నుంచి స్థానిక విలేకరులు 25కిలోల బియ్యం అందజేశారు.

కుట్టు మిషన్ పంపిణీ

శ్రీరాంపూర్: నిరుపేద ముస్లిం ఆఫీస్ అతార్ కుటుంబానికి నస్పూర్ ఆర్కే 5 కాలనీ జామే మసీదు కమిటీ సభ్యులు కుట్టు మిషన్‌ను అందించారు. సీసీసీలో టైలర్ నడుపుకుంటున్న అతార్ టైలర్ షాప్ కొద్ది రోజుల క్రితం ప్రమాదశాత్తు దగ్ధం అయ్యింది. దీంతో కుట్టు మిషన్, ఇంటి వస్తువులు కాలిపోయాయి. దీంతో ఆ కుటుంబానికి కమిటీ సభ్యులు రూ.25వేల విలువ చేసే కుట్టు మిషన్‌ను అందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఎండీ మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అడ్డుకోవడం సరికాదు'

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తగరపు సత్యం పేర్కొన్నాడు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశంతో పాటు, నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం 'నేనుసైతం ఫౌండేషన్' ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు.

బొగ్గుబాయి వార్తలు

ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీలో పలువురికి చోటు

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీలో శ్రీరాంపూర్ నుంచి పలువురికి చోటు కల్పించారు. నూతన కమిటీని ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ శనివారం ప్రకటించారు. మొత్తం 135మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో శ్రీరాంపూర్ నుంచి ఏరియా ఉపాధ్యక్షుడిగా ఉన్న జెట్టి శంకర్‌రావును అదనంగా కేంద్ర కమిటీ ముఖ్య ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఆయనతో పాటు కేంద్ర ఉపాధ్యక్షులుగా గరిగే స్వామి, కలవేన శ్యాం, డెప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా ఐరెడ్డి తిరుపతిరెడ్డి, ల్యాగల శ్రీనివాస్, సెక్రెటరీగా కాల్వ శ్రీనివాస్, సోషల్ మీడియా సెక్రెటరీగా కారుకూరి మనోజ్‌వర్మతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులు నియమించారు.

బీసీ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆర్కే న్యూటెక్ గనిలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో కన్వీనర్‌గా సిద్ధం అజయ్, కో కన్వీనర్‌గా గుంపుల హనుమంత్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ముస్కే సమ్మయ్య, బుద్రి బుచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, పాగాకు రమేశ్, జక్కుల సాగర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ గ్రూప్ ఏజెంట్‌గా పని చేసి ఎస్‌వోటు జీఎంగా పదోన్నతి పొంది ఆర్జీ 1 ఏరియాకు బదిలీపై వెళ్తున్న గోపాల్‌సింగ్‌ను శనివారం ఎస్సార్పీ 1 గనిపై జరిగిన టీబీజీకేఎస్ నేతలు సన్మానించారు. ఏరియాలో ఏజెంట్‌గా ఆయన చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, టీబీజీకేఎస్ నాయకులు పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, జీ స్వామి, ఉత్తేజ్‌రెడ్డి, కుర్మ వికాశ్, బత్తుల రాజేశం పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన జీఎం



క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా సింగరేణి క్రీడాకారులు పలు ఏరియాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా శనివారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం దేవేందర్ క్రీడాకారులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో క్రీడలకు యాజమాన్యం ప్రాధాన్యతనిస్తుందన్నారు. సింగరేణి అందించే ప్రోత్సాహంతో క్రీడాకారులు కోలిండియా పోటీల్లో ప్రతిభ కనబరిచి సత్తా చాటుతున్నారన్నారు. గత నెల ఒడిస్సాలోని చంబల్‌పూర్‌లో జరిగిన కోలిండియా బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ఏరియా వర్క్‌షాపులో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వర్తించే వెంకటేశ్వర్లు గోల్డ్ మెడల్, కాసిపేట–2 గనిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే భాగ్యశ్రీ, కాసిపేట–1 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తించే మనోహర్ బ్రాంజ్ మెడల్ సాధించారు. రెండు రోజుల క్రితం కొత్తగూడెంలో జరిగిన కంపెనీ లెవెల్ కల్చరల్ మీట్‌లో ఏరియాకు చెందిన టీం మొదటి బహుమతి సాధించిందని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తిక్, స్పోర్ట్స్ ఏరియా కో ఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

ఓబీ సంస్థకు వ్యతిరేకంగా బీజేపీ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న సీఆర్ఆర్ కంపెనీ అధికారుల వైఖరికి నిరసనగా బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఓబీ వాహనాలను అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సత్రం రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్రె చక్రవర్తి మాట్లాడుతూ.. సీఆర్ఆర్ కంపెనీలో ఇటీవల తొలగించిన 25మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తున్నా సింగరేణి అధికారులు కూడా పట్టించుకోవడడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ తోటి కార్మికుల తొలగింపునకు నిరసనగా చేపట్టుతున్న పోరాటా లకు తాము పూర్తి మద్ధతిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి బలవంతంగా పంపించారు. మాజీ ఎంపీటీసీ అగ్గు మల్లేశ్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు



ప్లాంట్ వద్ద ఎంపీపీఎస్ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని కేకే–5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) స్కూల్ విద్యార్థులు నో బ్యాగ్ డే సందర్భంగా శనివారం ఏరియాలోని సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. గైడ్ టీచర్ భీమ్‌పుత్ర శ్రీనివాస్ సోలార్ పవర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రత్యామ్నాయ పర్యావరణ హితమైన ఇంధన వనరులైన సౌర విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని పవర్ ప్లాంట్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేష్ విద్యార్థులకు వివరించారు.

ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడిగా రవి



నియామకపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

రామకృష్ణాపూర్: ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడిగా మల్లిఖార్జున్‌నగర్‌కు చెందిన మూటిక రవిని నియమించారు. యూనియన్ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ శనివారం నియామకపు పత్రాన్ని అందించారు.

సోలార్ సిగ్నల్స్ ఏర్పాటు



ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం వద్ద ప్రమాదాల నివారణ కోసం సోలార్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల పొడవు నాలుగు వరసల రహదారిని నిర్మించారు. అయితే నాలుగు వరసల రహదారిలో గల ఆవిడం ఎక్స్‌రోడ్డు, బస్టాండ్, ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణ కోసం సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల రాత్రి సమయంలో వాహన చోదకులకు ఎంతో సౌకర్యంగా మారింది.